


ఇక్కడ కోడ్ కూయలేదు..!

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరామపురం, ఎ.మల్లవరం గ్రామాల్లో ఉన్న మంచినీటి ట్యాంకులకు వేసిన రంగులు విమర్శలకు తావిస్తున్నాయి. మంచినీటి ట్యాంకు నిర్మాణం సమయంలో వైసిపి రంగులను పోలిన రంగులు ట్యాంకులకు ఉండడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు ఎన్నికల నియమావళి వేటికి వర్తించవాఅ? అని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తక్షణమే ఆయా ట్యాంకులకు వేసి వైసిపి రంగులను పోలి ఉన్న రంగులను మార్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వైసిపి రంగులతో పోలిన రంగులతో వాటర్ ట్యాంకు

ఆసక్తికరం పెద్దాపురం రాజకీయం

- హ్యాట్రిక్ కోసం చినరాజప్ప
- కల సాకారం కోసం దొరబాబు

ప్రజాశక్తి - సామర్లకోట

సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో పెద్దాపురం నియోజకవర్గ రాజకీయం ఆసక్తికరంగా మారింది. విమర్శలు, ప్రతివిమర్శలు పక్కన పెడితే ఈ నియోజకవర్గం నుంచి పోటీ పడుతున్న ఇద్దరు అభ్యర్థులు ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఈ నియోజక వర్గం నుంచి రెండు దఫాలు టిడిపి ఎంఎల్ఏగా వరుసగా గెలుపొందిన నిమ్మకాయల చినరాజప్ప మూడో దఫా బరిలో నిలిచి హ్యాట్రిక్ సాధించాలని అడుగులు వేస్తున్నారు. ఇక అధికార వైసిపి అభ్యర్థిగా నిలిచిన దవులూరి దొరబాబు గత 20 ఏళ్లుగా ఎంఎల్ఎ కావాలన్నా కలను సాకారం చేసుకునేందుకు సిద్ధపడుతున్నారు. వైసిపి ఆవిర్భావం తరువాత ఆ పార్టీ ఎదుర్కొన్న రెండు ఎన్నికల్లోనూ పరాజయం తప్పలేదు. ఈ రెండు దఫాలు నియోజకవర్గ ప్రజలు టిడిపికే మద్దతుగా నిలిచారు. అయితే ప్రస్తుత అభ్యర్థి దవులూరి దొరబాబు గత 20 సంవత్సరాలుగా సాగిస్తున్న ప్రయత్నాల నేపథ్యంలో ఆఖరికి వైసిపి అభ్యర్థిత్వాన్ని పొందారు. దొరబాబు మొదటిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు చేశారు. అక్కడ టిక్కెట్టు దక్కకపోవడంతో మరుసటి ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు చేశారు. అక్కడా ఆయనకు చేదు అనుభవమే ఎదురైంది. ఇక 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా బి-ఫారంను పొందగల్గారు. అయితే స్థానికంగా ఆశావహుల సంఖ్య అధికంగా ఉండటంతో నియోజకవర్గంతో సంబంధం లేని చినరాజప్పను కోనసీమ ప్రాంతం నుంచి తీసుకొచ్చి పోటీలో నిలిపింది. 2019లోనూ అదే పార్టీ అభ్యర్థిత్వం కోసం దొరబాబు తీవ్రంగానే ప్రయత్నించారు. అయితే పార్టీ అధిష్టానం మాత్రం తిరిగి రాజప్పనే కొనసాగించింది. దీంతో ఆయన వైసిపిలో చేరారు. ఈ నేపథ్యంలోనే ఆయన ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో దొరబాబు వైసిపి అధిష్టానం నుంచి అభ్యర్థిత్వాన్ని సాధించారు. ఒక పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి, ఎంఎల్ఎ కావాలన్నా తన 20 ఏళ్ల కలను సాకారం చేసుకునేందుకు ఆయన అడుగులు వేస్తున్నారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతూ ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఆయన ఆశలన్నీ స్థానికుడు కావడం, ప్రభుత్వ అమలు చేసిన సంక్షేమ పథకాలే ఆయన విజయానికి కారణం అవుతాయని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. అయితే ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఏ మేరకు ఆయన విజయానికి నష్టం కల్గిస్తుందనేది నేడు చర్చానీయాంశంగా మారింది.





2014 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి తోట సుబ్బారావు, 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిని తోట సరస్వతి వాణి 11 వేలు, 10 వేలు ఓట్ల తేడాతో పరాయం పాలయ్యారు. అయితే 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థి తుమ్మల రామస్వామి(బాబు)కు సుమారు 25,000 ఓట్లు పోలయ్యాయి. అయితే ప్రస్తుత ఎన్నికల్లో జనసేన, బిజెపి బలపర్చిన టిడిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప విజయం తనదేనని ధీమాగా ఉన్నారు. గురువారం రాత్రి మొదటి సారిగా సామర్లకోట పూర్ణ కళ్యాణ మండపంలో టిడిపి, జనసేన, బిజెపి పక్షాలు విభేదాలు వీడి ఐక్యంగా పనిచేయాలని ఆత్మీయ సమావేశంలో నిర్ణయించారు. 2014 ఎన్నికల్లో అనూహ్యంగా అమలాపురం నుంచి ఈ నియోజకవర్గానికి వచ్చిన చినరాజప్ప విజయం సాధించి ఉపముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మంత్రిగా అవకాశం రావడంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ప్రజల మనసులో సుస్థిర స్థానాన్ని సాధించుకున్నారు. 2019 ఎన్నికల్లో వీచిన వైసిపి గాలిని సైతం తట్టుకుని ఇక్కడ రాజప్ప రెండోసారి ఎంఎల్ఏగా విజయం సాధించారు. అయితే రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఎంఎల్ఏకు కేటాయించే నిధులను వైసిపి ఇన్‌ఛార్జ్ దొరబాబుకు అప్పగించడంతో ఆయన ఎంఎల్ఎ పదవికే పరిమితం అయ్యారనేది టిడిపి శ్రేణుల వాదన. అయితే ప్రస్తుత ఎన్నికల్లో ఈ సీటును ఆశించిన మాజీ ఎంఎల్ఎ బొడ్డు భాస్కర రామారావు కుమారుడు బొడ్డు వెంకటరమణ చౌదరి, కాకినాడకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ గుణ్ణం చంద్రమౌళిలు ఏమేరకు రాజప్పకు సహకరిస్తారనేది నేడు చర్చానీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే రాజప్ప వైసిపిలోని అసంతృప్తివాదులను టిడిపిలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు సరిహద్దు నియోజకవర్గం పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎంఎల్ఏగా పోటీలో ఉండటం టిడిపికి కలిసివచ్చే అంశంగా ఉంది. అలాగే మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వైసిపిలోకి రావడం తమకు కలిసొస్తుందనే ఆశతో వైసిపి అభ్యర్థి దొరబాబు ఉన్నారు. ఊహాగానాలు, ప్రత్యర్థుల ప్రయత్నాలు ఎన్ని ఉన్నప్పటికి టిడిపి అధినేత చంద్రబాబు ముందస్తుగానే సామర్లకోట పర్యటనలో చినరాజప్పకు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. అలాగే దొరబాబుకు వైసిపి టికెట్‌ను ఖరారు చేసింది. 2019 ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో జరిగిన ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల్లోనూ, మున్సిపల్ ఎన్నికల్లోనూ దొరబాబు ఆధ్వర్యంలో వైసిపి విజయాలను అందుకుంది. ఈ నేపథ్యంలోనే దొరబాబుకు వైసిపి అధిష్టానం అవకాశం కల్పించింది. ఎవరి అంచనాలు, ఊహాగానాలు ఎలావున్న రాజప్ప హ్యాట్రిక్ కొడతారా? వైసిపి అభ్యర్థి దొరబాబు మొదటి సారి పెద్దాపురం కోటపై వైసిపి జెండా ఎగుర వేస్తారా? అనే ఉత్కంఠ నెలకుంది. దీంతో పెద్దాపురం నియోజక వర్గంలో ఎన్నికల ఆట ఆసక్తికరంగా మారింది.

ముందస్తు అనుమతి తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించి ప్రసార మాధ్యమాల్లో ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గ దర్శకాలు అనుసరించి జిల్లాస్థాయి మీడియా సర్టి ఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కమిటీ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముం దస్తు అనుమతి ఇవ్వడంతోపాటు, చెల్లింపు వార్తలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని, మీడియా ఉల్లంఘనలు కూడా గుర్తించి తగిన చర్యలు తీసుకుం టుందన్నారు. రిజిస్టర్ కాబడిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు గానీ వారి తరపున ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు అనుమతి పొందుట కోసం నిర్ణీత నమూనాలో ప్రకటన ప్రసారం చేయుటకు 3 రోజులు ముందుగా జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీకి ధరకాస్తు చేసుకోవాలని తెలిపారు. రిజిస్టర్ కానటువంటి రాజకీయ పార్టీలు, ఇతర వ్యక్తులు వారి ప్రకటన ప్రసారం చేయుటకు 7 రోజులు ముందుగా జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు అందిన రెండు రోజుల్లోగా జిల్లాస్థాయి ఎంసిఎంసి కమిటీ అనుమతి మంజూరు చేస్తుందని వెల్లడించారు. వార్తాపత్రికల్లో పోలింగ్ రోజు, పోలింగ్ ముందు రోజు ప్రచురించాల్సి ప్రకటనలకు తప్ప నిసరిగా ఎంసిఎంసి నుంచి అనుమతి పొంది ప్రకట నలు మాత్రమే ప్రచురించాలని తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడి యా పరిధిలోకి అన్ని రకాల టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, డిజిటల్ డిస్ప్లేలు, మొబైల్ నెట్‌వర్క్‌ల ద్వారా ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజ్‌లు వస్తాయని, అలాగే సామాజిక మాధ్యమాలైన (సోషల్ మీడియా) ఫేస్ బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇంస్టా గ్రామ్, వాట్సాప్, గూగుల్ వెబ్సై ట్లు, వికిపిడియా కూడా ఎలక్ట్రానిక్ మీడియా పరిధి లోకి వస్తాయని తెలిపారు. అలాగే సినిమా హాళ్ల లోనూ, ప్రయివేట్ ఎఫ్ఎం రేడియోలలో, ఎలక్ట్రానిక్ పత్రికలలోను, ప్రసారమయ్యే, ప్రచురిత మయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలు కూడా తప్ప నిసరిగా ముందస్తు ధ్రువీకరణ పొందాల్సి ఉంటుం దన్నారు. అనుమతి పొందిన ఆర్డర్ నంబర్‌ను సంబంధిత ప్రకటనపై సూచించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని అన్ని ప్రసారమాధ్యమాలు గమనించాలని సూచించారు. ఎంసిఎంసి అనుమతి లేకుండా చేసే ప్రసారాలు, ప్రకటనలు ఎన్నికల ప్రవర్తనా నియ మావళి ఉల్లంఘనలుగా పరిగణించి, భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



నన్నయ యూనివర్శిటీలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'సస్టైనబుల్ యూస్ ఆఫ్ వాటర్ అండ్ ఓట్ ఇన్ ఏ సస్టైనబుల్ డెమోక్రసీ' అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ ఎస్.ప్రశాంతి అధ్య క్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు పాల్గొని ప్రస్తుత కాలంలో ఉన్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి హక్కులను వర్గాల ఆధారంగా ఏ విధంగా అసమానతలకు గురవు తున్నాయి, ప్రస్తుత కాలంలో యువత యొక్క ఓటు హక్కును ఉపయోగించి భారతదేశ అభివృద్ధిలో ఏ విధంగా పెంపొందించుకోవాలి, అలాగే ప్రాణాధారమైన ప్రకృతి మనకి ఇచ్చిన నీటిని ఏ విధంగా కాపాడుకోవాలి అనే అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు అధ్యాపకులు ఆలపాటి శ్రీనివాస్ , అధ్యాపకులు డాక్టర్ ఎం .పోచయ్య, డాక్టర్ ఎం.నానిబాబు, డాక్టర్ జోసెఫ్ స్టీఫెన్, డాక్టర్ హారిక, డాక్టర్ విజయశ్రీ, డాక్టర్ అప్పారావు, డాక్టర్ మధుకుమార్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి

వాలంటీర్ తొలగింపు


ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని రౌతులపూడి గ్రామానికి చెందిన వాలంటీర్ గొంప గోవిందును తొలగించినట్లు ఎంపిడిఒ విద్యాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మండల గ్రామమైన బంగారు పేటలో ప్రతిపాడు వైసిపి నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు చేపట్టిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు సి విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పిఎస్ పరీక్షకు 122 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మండల పరిధిలో జరిగిన పిఎస్ పరీక్షకు 2001 విద్యార్థులకుగాను 1879 మంది హాజరు కాగా 122 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సామర్లకోట ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ కె.శ్రీధర్ బృందం పరిశీలించింది.



రికార్డులను తనిఖీ చేస్తున్న డిఎం అండ్‌హెచ్‌ఒ

అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక గాంధీనగరం మున్సిపల్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం డిఎం అండ్‌హెచ్‌ఒ డాక్టర్ జె నరసింహ నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత కేంద్రంలో నిర్వహిస్తున్న పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ నగరం, గణపతి నగరం 2 అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో నిర్వహిస్తున్న పిఎంవివై రిజిస్ట్రేషన్లు, గర్భిణీల రిజిస్ట్రేషన్లు, వారికి అందవలసిన సేవలు, పారిశుధ్యం తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. సేవల్లో జాప్యం లేకుండా సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మెడికల్ ఆఫీసర్లు సిహెచ్.భవ్య శ్రీ, కె.ప్రభ డిపిఎంఒ డాక్టర్ బి.సురేఖ, డివైఎస్ఒ గిరి గణేష్ పాల్గొన్నారు.

విజేతలకు సర్టిఫికెట్స్ అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

అంతర్జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందచేశార. కాకినాడ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు శనివారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్లు అప్పన్న, పుష్ప, ప్రవళిక, దేవి పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో రైతుల పోరాటానికి సంఘీభావం

ప్రజాశక్తి - యంత్రాంగం

దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలు ఫణంగా పెట్టిన యువ కిషోరాలు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల 93 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లాలోని పలు మండలాల్లో ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవుల పోరాట స్ఫూర్తితో మతోన్మాద రాజకీయాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. **కాకినాడ** స్థానిక కచేరి పేటలోని సిపిఎం కార్యాలయంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, జిల్లా ఉపాధ్యక్షులు కె.సత్తిరాజు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర పోరాటంతో ఏ మాత్రమూ సంబంధం లేని శక్తులు నేడు అధికారంలో భారతదేశాన్ని పాలిస్తున్నాయని, ఎందరో త్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర భారతాన్ని ఫాసిస్టు పాలన దిశగా బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం తీసుకు వెళుతుందని దుయ్యబట్టారు. రాజ్యాంగాన్ని సైతం ధిక్కరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, కోశాధికారి మలకా రమణ, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రమణమ్మ, నర్ల ఈశ్వరి, కామేశ్వరి నాగలక్ష్మి, వేణు, జ్యోతి, రత్న కుమారి, రాణి తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు వర్ధంతి సభ ప్రజా సంఘాల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజుబాబు మాట్లాడారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఎ.బాబురావు చల్లా సంతోష్ కుమార్, గుత్తుల చెన్నయ్య, పులపకూర కృష్ణ, సుబ్బరాజు, వాసంశెట్టి సత్యనారాయణ, గుబ్బల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ** స్థానిక ఇంద్రపాలెం మార్కెట్ వద్ద భగత్ సింగ్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, మన ఊరు మన బాధ్యత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల 93 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సిహెచ్.విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి పెద్దింశెట్టి రామకృష్ణ, మన ఊరు మన భాధ్యత వ్యవస్థాపకులు ఎం.రామ్మోహన్, యువజన సంఘం నాయకులు రవికుమార్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, సుందరయ్య భవన్ కార్యాలయ కార్యదర్శి కె.వీరబాబు, పూర్వ డివైఎఫ్ఐ నాయకులు చంద్రరావు, ఉదయభాస్కర్, సత్తిబాబు, రెడ్డి, పంచాయితీ వర్కర్స్ యూనియన్ నాయకులు భద్రం, శ్రీను, సిఐటియు మండల కార్యదర్శి టి.రాజా, ఎస్ఎఫ్ఐ నాయకులు గంగ సూరిబాబు, ట్రేడ్ యూనియన్స్ నాయకులు ఏడుకొండలు పాల్గొన్నారు. స్థానిక జగన్నాధపురంలో భగత్ సింగ్ విగ్రహానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉషారాణి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పి.ఆర్ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ హిస్టరీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. భగత్ సింగ్, రాజ్ గుర్, సుఖదేవ్ చిత్రపటాలకు హిస్టరీ డిపార్ట్మెంట్ హెడ్ వెంకటేశ్వరరావు అధ్యాపకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు హరికిషన్, నాయిక్, జాన్, ప్రేమకుమారి, అరుణ, ప్రత్యూస, ఎస్ఎఫ్ఐ నాయకులు సంజయ్ పాల్గొన్నారు. అలాగే సిఐటియు ఆధ్వర్యంలో జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్, జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్, కెఎంసి క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నగరం అధ్యక్షులు పలివెల వీరబాబు, సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.విజయ్ కుమార్, రమేష్, రవి, పుష్ప, మెస్ వర్కర్స్ యూనియన్ ఏడుకొండలు, శ్రీను, వీరబాబు, క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ ఇస్మాయిల్, విక్టర్ సంతోష్ పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద గల భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్న, రాజు, వీరబాబు, విశ్వనాథం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు డి.సత్యనారాయణ, సూర్యనారాయణ, నేరియ్య, శ్రీను, నూకరాజుదొర, శ్రామిక మహిళలు విజయ శాంత పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక నువ్వుల గుంట వీధి సెంటర్‌లో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిఐటియు నాయకులు డి.క్రాంతి కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గోపాలకృష్ణ, అరుణ్ కుమార్, సిఐటియు నాయకులు గడిగట్ల సత్తిబాబు, చింతల సత్యనారాయణ, ఎస్.శ్రీనివాస్, ప్రజానాట్యమండలి నాయకులు దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, దారపురెడ్డి సత్యనారాయణ, మహాపాతిన రాంబాబు, కార్మిక నాయకులు కూనిరెడ్డి అప్పన్న, నెక్కల నరసింహమూర్తి పాల్గొన్నారు. అలాగే మండలంలోని పులిమేరు గ్రామంలో ఎఐఎఫ్‌టియు, ఎపిఆర్‌సిఎస్ ఆధ్వరంలో వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కుంచె అంజిబాబు, వల్లూరి రాజబాబు, రామలక్ష్మి పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో రోటరీ బ్లడ్ బ్యాంక్ కాకినాడ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ మాట్లాడారు. ఈ రక్తదాన శిబిరంలో 48 మంది రక్తదానం చేశారు. ఈ రక్తదానం చేసిన వారిలో 48సార్లు చెక్కల రాజకుమార్, 32 సార్లు మామిడి కృష్ణ రక్తదానం చేశారు. భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు బాలం హరిబాబు, చల్లా మహేష్, నాయకులు బాలం శ్రీనివాస్, కరణం ప్రసాద్ రావు, కరణం గోవిందరాజు, మహిళా సంఘం నాయకులు వరలక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు నాగమణి, ఎస్తేరు రాణి పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** స్థానిక తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో సిపిఎం నాయకులు సిహెచ్.అజయ్ కుమార్, కొవ్వాడ గ్రామపంచాయతీ కార్మికులతో మేడిశెట్టి వెంకటరమణ, ఇండస్ట్రియల్ ఏరియాలో సిఐటియు కాకినాడ రూరల్ ఇండస్ట్రియల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జోగా అప్పారావు, బండారు నాగేశ్వరరావు, బండారు ఆంజనేయులు, తటవర్తి సుబ్బారావు, చిట్టిమేను ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే వలసపాకల సుందరయ్య కాలనీలో సిఐటియు ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు కన్వీనర్ టి. రాజా, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమల శెట్టి నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, చింత శ్రీహరి, బలరాం, సంగీతరావు, నూకరాజు, రాంబాబు, రాము, దుర్గాప్రసాద్, పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని కోలంక గ్రామంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చల్ల సంతోష్ కుమార్ కుంభత్తుల వెంకటరమణ మారెళ్ళ నరసింహమూర్తి, బండారు వీరబాబు, బూరెల చిన్న, పెద్దిరెడ్డి రాజు, నందికోల సత్తిబాబు, యాళ్ళ బాబురావు పాల్గొన్నారు.



తాళ్లరేవులో జరిగిన వర్ధంతి సభలో మాట్లాడుతున్న కెఎస్ శ్రీనివాస్



కాకినాడలో వర్ధంతి సభలో నివాళులర్పిస్తున్న శేషబాబ్జి, సత్తిరాజు, ఇతరులు

కార్టూ'నిజం'



ఆదిత్యలో ఘనంగా ఎచీవర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలల ఆధ్వర్యంలో శనివారం ఎచీవర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2023 -24 విద్యా సంవత్స రంలో ఫైనల్ ఇయర్ చదువుతూ వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్, వివిధ విభాగాల డీన్ లు విభాగాధిపతులు విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా.సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం ఇప్పటి వరకు అత్యధికంగా రూ.33.37 లక్షల వార్షిక వేతనంతో ఒక్కరు, రూ.25లక్షలు ఆపై 9 మంది, రూ.10లక్షలు ఆపైన 23 మంది రూ.5లక్షలు ఆపైన వార్షిక వేతనంతో 147 మంది మొత్తం 1470 మందికి వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ బిడ్డలను డిగ్రీ పట్టాలతో పాటు మంచి వార్షిక వేతనంతో ఉద్యోగాలు వచ్చేలా తీర్చిదిద్దిన ఆదిత్య యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను, తల్లిదండ్రులను యాజమాన్యం తరపున ప్రశంసాపత్రం, జ్ఞాపిక, శాలువాలతో ఘనంగా సత్కరించారు.



విద్యార్థుల తల్లీదండ్రులను సత్కరిస్తున్న ఆదిత్య సిబ్బంది

బాలికల విద్యా వికాసానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ ఉషా

ప్రజాశక్తి - పెద్దాపురం

బాలికల విద్యా వికాసానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఐసిడిఎస్ పెద్దాపురం ప్రాజెక్టు సిడిపిఒ జి.ఉషా అన్నారు. శనివారం స్థానిక సత్తమ్మ కాలనీలోని సాగర్ మున్సిపల్ హైస్కూల్లో హెడ్మాస్టర్ కెవివిఎన్ఎస్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన 'భేటీ బచావో-బేటి పడావో' అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలంటే చిన్నప్పటి నుంచి బాలికలను విద్యాభివృద్ధికి ప్రోత్సహించాలన్నారు. నూరు శాతం మంది బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్య వివాహాల వల్ల అనర్ధాలు, ఆరోగ్య సమస్యలు, నష్టాలను ఆమె వివరించారు. ఈ సదస్సులో ఉపాధ్యాయని ఎస్.రామలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు దేవి, ఉమా, ఇంద్ర, జయ, స్నేహలత పాల్గొన్నారు.

సమాజ మార్పు కోసమే కవిత్వం



సమావేశంలో మాట్లాడుతున్న కవి పోచినపెద్ది సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సమాజ మార్పు కోసం, వారి వారి హవ భావాలకు అక్షర రూపం ఇచ్చేది కవిత్వమని శతావధాని, భాషా పండితులు పోచినపెద్ది సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం స్థానిక ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ కవిత్వ దినోత్సవాన్ని ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ రుగ్మతలను పారద్రో లేందుకు, జనాన్ని జాగృతం చేసేందుకు ఉపయోగపడే పదునైన ఆయుధం కవిత్వమని అన్నారు. కవిత్వానికి చదువు, వయసు సంబంధం లేదని సృజనాత్మకత ఉంటే జగతిని జాగృతం చేయవచ్చని అన్నారు. కవిత్వం కేవలం ఆనందం కోసం కాకుండా సమాజ ప్రయోజనం లోతులోంచి రావాలన్నారు. నిజాన్ని నిర్భయంగా వ్యక్తం చేసేది కవిత్వ మన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికతవేత్త రవిశంకర్ పట్నాయక్, పి.పార్థసారథి, రాజా, రాఘవరావు, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పాలటిన్నుల్లో సారా రవాణా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

పాల వ్యాపారం పేరుతో పెద్ద ఎత్తున నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని ప్రత్తిపాడు ఎక్సైజ్ అధికారులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సిఐ చిరంజీవి తెలిపిన వివరాలు ప్రకారం.. ఎన్నికల తనిఖీల్లో భాగంగా ఏలేశ్వరం ఎర్రవరం ఆర్ అండ్ బి రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా పాల టిన్నుల్లో వంద లీటర్ల నాటుసారా ప్యాకెట్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారు చేసినా, అమ్మినా, వేరే ప్రాంతాలకు తరలించినా కఠిన శిక్షలు తప్పవు అని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఎం.అశాలత, సిబ్బంది వెంకన్న దొర, కృష్ణార్జున రావు, దొరబాబు రాజు, వీరభద్రరావు, రాంబాబు, సలాం పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉలమారు

ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ తెలిపిన వివరాలు ఇవి.. అనంతపురం జిల్లా మూడి దిబ్బ మండలంలోని వేములవారిపల్లెకు చెందిన ఉడదలపల్లి రమేష్ బాబు(45) మండల కేంద్రంలో నివాసం ఉంటున్న సోదరుని ఉడదలపల్లి రామకృష్ణ ఇంటికి అప్పుడప్పుడు డబ్బుల కోసం వస్తుంటాడు. అదే విధంగా ఈ నెల 19న సోదరుని వద్దకు డబ్బుల కోసం వచ్చి వెళ్లాడన్నారు. శనివారం ఉదయం జొన్నాడ ఏటు గట్టు రోడ్డ్ పక్కన ఉన్న మామిడి చెట్టుకి ఉరి వేసుకుని మతి చెంది ఉన్నట్లుగా గుర్తించామన్నారు. దీనిపై మతుని సోదరుడు ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. అయితే మతునికి తల్లిదండ్రులు లేకపోవడం వలన ఇప్పటివరకు వివాహం కాలేదన్నారు. మద్యానికి బానిసై, చెడు వ్యసనాలకు అలవాటైనట్లు మతిని సోదరుడు తెలిపాడన్నారు. దీంతో అప్పులు ఎక్కువ కావడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమిక అంచనా వేసినట్లు ఎస్ఐ తెలిపారు. దీనిపై సమగ్రమైన దర్యాప్తు చేపట్టామన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సామ్యూల్

కించపరిచేలా ప్రకటనలు వద్దు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

గైగోలుపాడులోని లూథరన్ చర్చ్ ఆస్తులు కాపాడేందుకు తాము పారదర్శకంగా పనిచేస్తే సంఘ సభ్యులు విశ్వాసం పొందామని, కావాలని కొందరు తమను కించపరిచేలా ప్రకటనలు ఇవ్వడం సరికాదని ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రెసిడెంట్. కొంగు సామ్యూల్, జనరల్ సెక్రటరీ బి.డేవిడ్, కోశాధికారి పివిఎస్.రెడ్డి అన్నారు. ఆవేదన వ్యక్తం చేశారు. గైగోలుపాడు లూథరన్ చర్చ్ ప్రాంగణంలో శనివారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సంఘ సభ్యుల సహకారంతో లూథరన్ చర్చ్‌లో ఇటీవల పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సంఘ విషయాలలోకి ఏ సంస్థగాని, వ్యక్తులు గాని కలుగ చేసుకోవద్దని అన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి సాల్మన్ రాజు, వైఎస్ ప్రెసిడెంట్ చింద్రిపు వినయ్, సంయుక్త కార్యదర్శి దాసరి డేవిజ్ జయకుమార్3, జెవిఎస్.రమణ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు


గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు మండలంలోని పోతులూరు, వాకపల్లి, వెంకటనగరం, తోటపల్లి గ్రామాలలో ప్రత్తిపాడు సిఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం సింగరంపాలెంలో మందకొండ మా లక్ష్మి అమ్మ 24వ జాతర మహోత్సవాల సందర్భంగా బాబు రాజేంద్రప్రసాద్ మెమోరియల్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు శనివారం ప్రారంభం అయ్యాయి. ఈ నెల 24వ తేదీ వరకూ ఫ్లెడ్ లైట్స్ వెలుతురులో జరుగే వాలీబాల్ పోటీలను కామినేని జయశ్రీ, జోగి, రాధిక, కోర్పు దుర్గా ప్రసాద్, జాస్తి వసంత్ ప్రారంభించారు. ఈ పోటీలకు 24 టీములు పాల్గొనగా నాకౌట్ పద్ధతిలో నిర్వహించడం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి ఎస్.నాగరాజు, శ్రీనివాస్, ఆనంద్,ప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక రమణయ్యపేట మోహన్ డిగ్రీ కాలేజిలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే మెడికవర్ హాస్పిటల్ సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ రాజేష్, డాక్టర్ శావ్య వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా బి.పి, షుగర్, ఇసిజి పరీక్షలు నిర్వహించారు. స్త్రీల సమస్యలపై చికిత్సపై అవగాహన కల్పించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మోహన్ విద్యాసంస్థల కరస్పాండెంట్. ఎమ్.మోహన్‌రావు, డైరెక్టర్. వెంకటేష్, కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీరాంబాబు పాల్గొన్నారు.

ఎన్నికల నగారాతో అటెన్షన్



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

2024 సార్వత్రిక ఎన్నికలకు నగరా మోగడంతో రాజకీయ పార్టీలతో పాటు అధికార యంత్రాంగంలోనూ అటెన్షన్ మొదలైంది. కొంతకాలంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఓటర్ల నమోదు, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, అధికారుల బదిలీలు, ఇవిఎంల భద్రత తదితర ప్రక్రియలను అధికార యంత్రాంగం చకచకా పూర్తి చేసిన విషయం విదితమే. మరో వైపు రాజకీయ పార్టీలు సైతం చక చకా సిద్ధం అయిపోయాయి. అధికార, విపక్ష పార్టీలు నియోజక వర్గాలవారీగా ఆర్థిక, సామాజిక సమీకరణలతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను దాదాపు పూర్తి చేశాయి. అధికార వైసిపి అసెంబ్లీ, ఎంపి స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించగా, టిడిపి, జనసేన, బిజెపి కూటమి కొన్ని స్థానాల్లో ప్రకటించాల్సి ఉంది. తాజాగా ఎన్నికల షెడ్యూల్ జారీతో మరో అడుగు ముందుకు పడింది. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ప్రచార అనుమతులకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఖర్చులు చూపించేందుకు కసరత్తు ముమ్మురం చేశాయి. 2 నెలల కాల వ్యవధి నేపథ్యంలో ఈ కసరత్తు కత్తిమీద సాములా మారిందనే అభిప్రాయం అభ్యర్థులలో వ్యక్తమవుతోంది. అయితే ఏ మేరకు నిబంధనలకు లోబడేందుకు అప్రమత్తమవుతారో వేచి చూడాల్సి ఉంది. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఇప్పటికే ఎన్నికల కమిషన్ స్పష్టం చేయటంతో అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో ఎలక్షన్ కోడ్ అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం ప్రచార జోరుకు తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. అభ్యర్థులు ఆచితూచి అడుగులు వేయడం ప్రారంభించారు. మరోవైపు ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లపై అధికార యంత్రాంగం కొరడా ఝుళిపించింది.

తొలి వేటు వాలంటీర్లపైనే

రాష్ట్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా వాలంటీర్లు సమిధలయ్యారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైన విషయం విదితమే. ఎన్నికల విధులకు ఉపయోగించరాదని ఇప్పటికే పలుమార్లు ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసిన విషయం విదితమే. అయినప్పటికీ అధికార పార్టీ కోసం ఇంటింటి ప్రచారానికి తెరలేపారని టిడిపి నాయకులు విమర్శించడంతో ఉన్నతాధికారులు దృష్టి సారించారు. పరిశీలనతో రుజువు కావటంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాలంటీర్లను విధుల నుంచి తొలగించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. గడిచిన నాలుగేళ్లలో కేవలం రూ.5 వేల వేతనం చెల్లించి ప్రభుత్వ విధులు అప్పగించింది. తాజాగా తొలగింపుల నేపథ్యంలో ఉపాధికి గండి పడింది. దీంతో వాలంటీర్లలో ఆందోళన వ్యక్తమవుతోంది.

టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థుల ప్రకటన

టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో ఎంపి అభ్యర్థుల సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. ఈ వారంలో విడుదల చేసిన మూడో జాబితాలో అమలాపురం, కాకినాడ ఎంపి స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. రాజమహేంద్రవరం పార్లమెంటు స్థానానికి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. ఈ స్థానం బిజెపి కోరుతున్న నేపథ్యంలో దాదాపుగా అభ్యర్థి ఖరారైనట్లు తెలుస్తోంది. త్వరలోనే ప్రకటిస్తారనే ప్రచారం ఊపందుకుంది. రాజమహేంద్రవరం ఎంపి స్థానం మినహా మిగిలిన రెండు స్థానాల్లో యువతకు అవకాశం లభించింది. అమలాపురం ఎంపీ స్థానంలో మాజీ స్పీకర్ ఎం.బాలయోగి తనయుడు ఎం.హరీష్‌ను బరిలో నిలిపారు. కాకినాడ బరిలో టీ టైమ్ అధినేత తంగెళ్ల ఉదయ్ కుమార్ తలపడనున్నారు. ఈ స్థానంలో అధికార పార్టీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌తో పోటీ పడనున్నారు. అమలాపురం ఎంపి బరిలో అధికార పార్టీ రాపాక వరప్రసాద్‌ను బరిలో నిలిపింది. ఇరు పార్టీలలో అభ్యర్థుల ఆర్థిక, సామాజిక సమీకరణలు ఎలా ఉన్నా ఓటర్లను ఏ మేరకు ఆకట్టుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

యానాం వార్తలు

ఘనంగా మీసాల వెంకన్న రథోత్సవం

ప్రజాశక్తి - యానాం


యానాంలో వెంకన్న రథోత్సవం

యానాం వెంకటేశ్వరస్వామి రథోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. స్థానిక చిన్నా సెంటర్ నుంచి రథం వద్ద ఆలయ అర్చకులు, వేదపండితులు ఆధ్వర్యంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు తదితరులు పూజలు చేశారు. అనంతరం రథోత్సవం భక్తుల కోలాహలం మధ్య ప్రారంభమైంది. యానాం వెంకన్న రథాన్ని భక్తులు భారీ తాళ్ల సహాయంతో లాగారు. స్థానిక చిన్నా సెంటర్ నుంచి పిల్లారాయవీధి మీదుగా బస్ కాంప్లెక్స్ వరకు రథయాత్ర భక్తుల మధ్య కన్నులపండువగా సాగింది. దారి పొడవునా భక్తులు షాపులు, డాబాల పైన ఎక్కి రథయాత్రను భక్తులు ఆద్యంతం తిలకించారు. రథాన్ని రాత్రి బస్ కాంప్లెక్స్‌లో నిలుపుదల చేయగా వందలాది మంది భక్తులు రథంపై కొలువైన స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం నుంచి ఉదయం వరకు భారీ తీర్థం జరిగింది. యానాం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. యానాం పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఆదివారం చక్రతీర్థం నిర్వహించనున్నారు.

విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం


ఉత్సవంలో పాల్గొన్న ఎంఎల్ఎ అశోక్

యానాం బైపాస్ రోడ్డులో బాలయోగి వారధి వద్ద నూతనంగా నిర్మించిన దొడ్డి గంగమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలలో యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొని పూజలు చేశారు. ముందుగా కమిటీ ప్రతినిధులు, పండితులు ఎంఎల్ఎకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 25 న అమ్మవారి విగ్రహ, శిఖర ప్రతిష్ట, అన్నసమారాధన కార్యక్రమం జరగనుందని ఆలయ నిర్వహకులు తెలిపారు.

చెక్ పోస్ట్ సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాం సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మజ్జిగను పంపిణీ చేశారు. యానాం రీజన్సీ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యానాం రీజియన్ కో-ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.వీరకుమార్ పాల్గొన్నారు.

ప్రయాణికుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ అధికారులతో సమీక్షిస్తున్న డిఎస్‌పి మోహన్‌రావు

ప్రజాశక్తి - సామర్లకోట

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజమహేంద్రవరం, కాకినాడ, తుని, సామర్లకోట రైల్వే స్టేషన్లో ప్రయాణికుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రైల్వే డిఎస్‌పి ఎల్.మోహన్‌రావు ఆదేశించారు. శనివారం సామర్లకోట రైల్వే స్టేషన్‌లో తుని, కాకినాడ, రాజమహేంద్రవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లకు చెందిన చెందిన జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్ల ద్వారా అక్రమంగా గంజాయి, మద్యం, నగదు, బంగారం వంటి తరలింపులకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రయాణికుల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో రైల్వే ఇన్‌స్పెక్టర్లు గౌస్‌బేగ్, డి.సైదయ్య, సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్, రైల్వే ఎస్‌ఐలు బి.లోవరాజు, అబ్దుల్ మరూఫ్, ఎన్.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి


ముగింపు సదస్సులో నిర్వహకులు

మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా పూర్తయింది. మొదటి రోజు అంతర్జాతీయ సదస్సులో తిరుచ్చి ఎన్ఐటి ప్రొడక్షన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వి.ఆనందకృష్ణన్, 2వ రోజు కాకినాడ జెఎన్‌టియు మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. వివిధ పరిశోధనలకు చెందిన రీసెర్చ్ పేపర్స్ ఈ సదస్సులో ప్రదర్శించబడ్డాయి ఈ ముగింపు కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రీసెర్చ్ మరియు డెవలప్మెంట్ డీన్ డాక్టర్ కెవిఎన్.రామచంద్రమూర్తి, స్టూడెంట్ అఫైర్స్ జెడి వెంకటేష్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎ.శరవణన్, కన్వీనర్స్ డాక్టర్ పివి.ఎలుమలై, డాక్టర్. సందీప్ కునార్, కో కన్వీనర్ డాక్టర్ ఐ.వీరాంజనేయులు, డాక్టర్ ఎం.జుబేరుద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ఎన్నికల ప్రచారం


కిర్లంపూడిలో ప్రచారం చేస్తున్న జ్యోతుల కుమార్తె సునీత

ప్రజాశక్తి - యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని శనివారం జిల్లాలోని పలు మండలాల్లో ఆయా నియోజకవర్గాల అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. **పెద్దాపురం** మండలంలోని తిరుపతి, చదలాడ గ్రామాల్లో వైసిపి అభ్యర్థి దవులూరి దొరబాబు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కర్రి వెంకట జగదీశ్వరరావు, కుంచె బుచ్చిరాజు, కుంచే అమరావతి, దవులూరు సుబ్బారావు, నెక్కంటి సాయిప్రసాద్ పాల్గొన్నారు. **కిర్లంపూడి** మండలంలోని కృష్ణవరంలో తెలుగు యువత నాయకుడు బోదిరెడ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు తోట సర్వారాయుడు, యడల రాంబాబు, బాబు రాజశేఖర్ పాల్గొన్నారు. **కరప** మండలంలోని కొరిపల్లి గ్రామంలో శనివారం టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అభ్యర్థి పంతం నానాజీ, టిడిపి నాయకులు పిల్లి సత్తిబాబు, పిల్లి అనంతలక్ష్మీ పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని చొల్లంగిలో ఎంఎల్‌ఎ సతీష్‌కుమార్ చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌సిటిసి సభ్యులు దొమ్మేటి సాగర్, నాయకులు కాదా గోవింద కుమార్, దున్న జనార్దన్‌రావు, శ్రీదేవి, సూర్యకుమారి, మల్లీశ్వరి, రత్నకుమారి, కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, బొంతు మోహన్, మోకా మధు పాల్గొన్నారు. **కోటనందూరు** మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మాలిక్ కోటనందూరు, జగన్నాధపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లగుడు శ్రీనివాస్, చినబాబు, రామచంద్రరావు, ఉపేంద్ర, దొరబాబు, కృష్ణ, నానిబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

ఎంపీ గీత ప్రచారానికి అధికారుల బ్రేకులు

ప్రజాశక్తి - పిఠాపురం


ఎంపీకి కోడ్ ఉల్లంఘనపై వివరిస్తున్న ఎన్నికల అధికారి

వైసిపి పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థి, ఎంపీ వంగా గీత ఎన్నికల ప్రచారాన్ని శనివారం ఎన్నికల అధికారులు అడ్డుకున్నారు. స్థానిక 3, 4 వార్డుల్లో వైసిపి జెండాలతో, నాయకులు, కార్యకర్తలతో ఇంటింటా ప్రచారం చేస్తుండగా ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి ఆర్‌వి.ప్రసాద్ పోలీసు సిబ్బందితో వచ్చి ప్రచారాన్ని అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ప్రచారం చేయడం సరికాదని చెప్పారు.దీంతో ఆమె వెనుతిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియామవళిని తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు.

ఎంఎల్‌ఎ పొన్నాడకు నిరసన సెగ

ప్రజాశక్తి - తాళ్లరేవు


ఎంఎల్‌ఎను నిలదీస్తున్న స్థానిక ప్రజలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని చొల్లంగి గ్రామానికి వచ్చిన ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్‌కుమార్‌కు నిరసన సెగ తగిలింది. చొల్లంగి సాల్ట్ భూములు స్థానికులకే ఇవ్వాలని 46 రోజులుగా దీక్షలు చేసిన ఒక్కరోజు కూడా దీక్ష శిబిరానికి రాలేదని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వచ్చావని స్థానికులు ఎంఎల్‌ఎను నిలదీశారు. సమస్యను పరిష్కరి స్తానని హామీ ఇచ్చినా నిరసన దీక్షలు చేయడం దేనికని ఎంఎల్‌ఎ స్థానికులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కట్ట త్రిమూర్తులు, గర్రె లక్ష్మీనారాయణ స్థానిక సర్పంచ్, వైసిపి నాయకులు పట్టించుకోకపోవడంతోనే దీక్షలు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ సమస్య జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సిఐ లక్ష్మణరావు

ప్రజాశక్తి - గండేపల్లి

రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సిఐ లక్ష్మణరావు సూచించారు. శనివారం మండలంలోని మల్లేపల్లి గ్రామంలో నవుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రశాంత వాతావ రణంలో తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలని, ఎటువంటి ఘర్షణలకు పాల్పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ఎలక్షన్ సమయంలో నమోదు కాబడిన కేసులు వారి భవిష్యత్తుపై మరింత ప్రభావం చూపుతాయని గుర్తుంచుకోవాలని సూచించారు.

పశు సంచార వైద్య సేవలు ఎంతో మేలు

ప్రజాశక్తి - కోటనందూరు


పశువుకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రామారావు

పశు సంచార వైద్య సేవలతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని పశువైద్యాధికారి నెమ్మది రామారావు అన్నారు. శనివారం మండలంలోని కెఇ.చిన్నయపాలెం, అల్లిపూడి, జగన్నాధపురం, పాతకొట్టం గ్రామాల్లో ఆయన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగాల బారిన పడి లేవలేని స్థితిలో ఉన్న పశువుల వద్దకే వెళ్లి వైద్య సేవలను అందించడమే సంచార వైద్య సేవల లక్ష్యమన్నారు. వాహనంలోనే మందులు వైద్య పరికరాలు ఉండటం వల్ల పశువుల ప్రాణాలను సకాలంలో కాపాడు కలుగుతున్నామని అన్నారు. సహాయక సిబ్బంది పైలు దుర్గాప్రసాద్, సుర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అవసరం

ప్రజాశక్తి - జగ్గంపేట


బాలలకు బహుమతిని అందిస్తున్న పూర్ణిమ

ప్రతి గర్భిణీ స్త్రీలు, బాలింతలు పోషక విలువల ఆహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ పూర్ణిమ తెలిపారు. శనివారం పక్వాడ పక్షోత్సవాల కార్యక్రమం ముగింపు సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల బరువు, ఎత్తు చూసి వెల్ బేబీ షో కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య వంతమైన పిల్లలకు బహుమతి ప్రదానం చేశారు. కిషోరి బాలికలకు బాల్య వివాహాల వలన జరిగే అనర్ధాలను, అక్రమ రవాణా గురించి, కిశోర బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేసి, తక్కువ ఖర్చుతో పోషక విలువలు గల ఆహారాన్ని ఏవిధంగా తీసుకోవాలి అనే దానిపై వివరించారు. ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారం కూడా గర్భవతులు, బాలింతలు తీసుకోవాలని, నిర్ణీత సమయంలో ఆహారం తీసుకోవాలని, వెయ్యి రోజుల ప్రాముఖ్యత ను వివరించారు. సుపోషిత భారత దేశం దిశ గా పోషకాహార ప్రాముఖ్యత ను తెలియజేస్తూ తల్లులచే ప్రతిజ్ఞ చేయించి పోషకాహార తరగతులు నిర్వహించారు. పోషణ పక్వాడ ను ప్రజలకు అవగాహన చేస్తూ భారీ గా ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సునీత, అమ్మాజీ, బేగం, బూసమ్మ, పార్వతి ,అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

రూ 3.52 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం


భోజనాలు చేస్తున్న భక్తులు

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒక రోజు వివిధ రూపాల్లో రూ.3.52 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహకాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దీనిలో వివిధ టిక్కెట్ల ద్వారా రూ.2,86,700, అన్నదాన విరాళాల ద్వారా రూ.60,237, కేశఖండన ద్వారా రూ.5,720, తులాభారం ద్వారా రూ.300 ఆదాయం సమకూరిందని వెల్లడించారు. ఈ సందర్భ:గా యాత్రికులకు ఉదయం పులిహార ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మకర్తలు, ఎంపిటిసి సభ్యులు కుంచే బుచ్చిరాజు, అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, రమేష్, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, గ్రామస్తులు యాత్రికులకు సేవలందించారు.